# టిక్కెట్స్ కట్స్

ఈ రోజుల్లో టిక్కెట్టు 'పదం' పత్రికల్లో తెగవాడుతున్నారు. ఎన్నికలకు, టిక్కెట్టుకు అవినాభావ సంబంధం వుందని అందరికీ తెలుసు. టిక్కెట్టు దొరికితే సంతోషం - లేకపోతే విచారం - ఒక్కొక్క సారి టిక్కెట్టు దొరికితే విచారం - ఎలా నెగ్గాలా అన్న బాధ - దొరకక పోతే సంతోషం - దొడ్డిదారిన పదవి సంపాదించవచ్చునే అని.

టిక్కెట్టు అంటే ఈ రోజుల్లో ప్రజల నుంచి పదవిదాకా తీసుకు పోయే పాస్ - అని అర్ధం.

"అయ్యో వెంకయ్యగారు చనిపోయారండీ!" అన్నాడు నా మిత్రుడు.

"అరె! ఏమయిందో!'

"టిక్కెట్టు కోసం దరఖాస్తు పెట్టాడా? టిక్కెట్టు దొరకలేదా!"

"అయినా ఈ డెబ్బయ్యో ఏట ఆయనకు టిక్కెట్టు ఎందుకండి".

"వృద్ధులే దేశాన్ని బాగా పరిపాలిస్తారని ఆయన నమ్మకం."

"ఎలా చనిపోయారు?"

"గుండె ఆగి" - టిక్కెట్టు రానందుకు విచారంవల్ల గుండె ఆగి పోయింది.

పాపం అని స్పందించాను.

"దేవుడు ఆయనకు తిన్నగా పైలోకానికే టిక్కెట్టు యిచ్చేశాడు" అన్నాడు మా మిత్రుడు.

టిక్కెట్టు కోసం ఢిల్లీ విమానం టిక్కెట్టు కొనుక్కుని నానా అవస్థలు పాలయినా కొందరికి టిక్కెట్టు దొరకలేదు.

"అయ్యా! ఇంకేముందండి - నా కొంప మునిగింది - టిక్కెట్టు దొరకలేదు. కాని పదిలక్షలు ఖర్చయిపోయాయి" అని గోలపెట్టాడు ఓ రాజకీయ శిఖామణి.

"బ్రదర్ - రాజకీయాలు ఓ వ్యాపారం - డబ్బు నువ్వు ఖర్చు పెట్టకూడదు - ఖర్చు పెట్టించాలి" అన్నాడు ఓ రాజనీతివేత్త,

నెగ్గే వాడికే టిక్కెట్టు - కాని నేరం చేసేవాడికి టిక్కెట్టు యివ్వం అన్నారు ఓ నాయకుడు చిదానందంగా-

"అబ్బ! దేశంలో యిన్నాళ్ళకు నీతి నిజాయితీ వెలిగిపోతాయన్న మాట" ఎంతో ఆనందించాడు ఓ స్వాతంత్ర్య సమరయోధుడు.

చివరకు టిక్కెట్లన్నీ నేరం చేయగలిగేవారికీ, నేరం చేసేవారికే లభించాయి.

"ఇదేం న్యాయం సార్!" అని ఓ వృద్ధ నిజాయితీ రాజకీయ త్యాగి దుఃఖం వెలిబుచ్చాడు.

ప్రక్కనే వున్న వో రాజకీయ వేదాంతి తాపీగా సెలవిచ్చాడు.

"నేరం అంటే ఏమిటయ్యా నే - అంటే నేతలకు రం - అంటే 'రమ్ము' లాంటివి. అందువల్ల నేరం నేతలకు వుండాలి - నెగ్గడం ముఖ్యం కాని ఎలా నెగ్గారు అన్నది ముఖ్యం కాదు - ప్రయత్నాల మధ్య ఎన్నో ఉపన్యాసాలు, వాగ్దానాలు చేస్తాం-కాని పార్టీ నెగ్గితే కదా- మనం నిజంగా పదవిలోకి వచ్చి ప్రజా సేవచేయగలిగేది!" అని సిద్ధాంత నిర్వచనాలు చెప్పారు ఆ వేదాంతి.

"అయ్యా! ఆడవాళ్ళకు సగం టిక్కెట్లు యివ్వాలి సార్" అన్నది వో మహిళా నాయకురాలు.

"బి.సి.లకు ఏభయి శాతం టిక్కెట్లులివ్వాలి సార్" అన్నాడు ఒక మాజీ జనాభా సేకరణ అధికారి - ఇటీవలే రాజకీయాలలోకి వచ్చి.

"హరిజనులకూ గిరిజనులకూ సగం టిక్కెట్లు యివ్వాలి సార్" అన్నాడో హరిజన నాయకుడు.

తీరా టిక్కెట్లు వచ్చాక అన్నీ కట్సే.

"టిక్కెట్టు అంటే డబ్బిచ్చి కొనుక్కోవాలి కదా - రైలులో, బస్సులో, అవునా! అలాగే రాజకీయాల్లో కూడా - డబ్బు పెట్టుబడి పెట్టకపోతే టిక్కెట్టు ఎవరిస్తారోయి" అన్నాడు వో రాజకీయ వ్యాపారి.

"అయ్యో! తమరు టిక్కెట్టుకు దరఖాస్తు పెట్టలేదా?" అని అడిగాడు ఒక రాజకీయ నిరాశావాది.

"నాకు టిక్కెట్టు ఎందుకు గురూ! నాకు ఎవరు డబ్బిస్తే వాడికి సాయం చేస్తా" అన్నాడు ఒ చోటా నాయకుడు.

"అది కాదు సార్! ఎవరు బాగా తాగిస్తే - వారికి సాయం చేస్తాం!" అన్నాడొక రౌడీ నాయకుడు.

"అది కాదు సార్! మా వాళ్ళకు పట్టాలిస్తే వారికి సాయం చేస్తాం" అన్నాడొక గుడిసెల నాయకుడు.

పదవిలో ఉన్నవాళ్ళకి కొందరికి టిక్కెట్స్ కట్స్ - కొత్తగా ఆశించిన వారికి కొందరికి టిక్కెట్స్ హిట్స్.

"ఏమండీ - టిక్కెట్టు దొరికిందా?" అని అడిగింది భార్య ఢిల్లీ నుంచి భర్తను పలకరిస్తూ.

"లేదు మోసం జరిగిపోయింది - నా టిక్కెట్టు కట్" అన్నాడు భర్త రాజకీయ నాయకుడు విచారంగా.

"పార్టీ మారలేకపోయారా?" అని సలహా యిచ్చింది.

"దానికి లేటయిపోయింది" అన్నాడు రాజకీయ భర్త తువ్వాలు నెత్తిన వేసుకుని -

"రండి! యింక భోజనానికైనా లేవండి"

"ఇక్కడ మాత్రం మీ భోజనం టిక్కెట్టు కట్ కాదులెండి" అంది భార్య గోముగా!

"ఏ టిక్కెట్టు దొరికినా దొరక్కపోయినా, సాపాటు తప్పదుగా" అన్నాడు ఆ రాజకీయ నాయకుని బావమరిది. ••